క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి నవనీత సేవ



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

బొండపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నవనీత సేవ నిర్వహించారు. అలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని 15 కిలోల వెన్నతో అలం కరించారు. అంతకుముందు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ల్యాబ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, తదితరులు

కొత్తవలస: మండల కేంద్రంలో వారపు సంతను ఆనుకుని నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ వద్ద మెడికల్ ల్యాబ్ ఏర్పాటుకు జిల్లా పరిషత్ సీఈఓ బి.వి.సత్యనారాయణ మంగళవారం స్థల పరిశీ లన చేశారు. ల్యాబ్ ఏర్పాటుకు సుమారు 6సెంట్ల స్థలం అవసరమని పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు జెడ్పీ సీఈఓకు వివరించారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ సంత స్థలం జిల్లా పరిషత్‌కు చెందిందని, ఖాళీగా ఉన్న భూమిని పీహెచ్‌సీ అవసరాలకు ఇచ్చే విషయం ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. ల్యాబ్ ఏర్పాటుకు స్థల మంజూరుకు కృషి చేస్తామన్నా రు.ఆయన వెంట ఎంపీడీఓ రమణయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలకు డస్ట్‌బిన్‌ల వితరణ



ఉపాధ్యాయులకు డస్ట్‌బిన్‌లు అందజేస్తున్న యువకుడు సురేష్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన యువకుడు కూనుబిల్లి సురేష్ మంగళవారం డస్ట్‌బిన్‌లు అందజేశారు. అలాగే గ్రామంలోని వీధుల్లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. సురేష్‌ను హెచ్‌ఎం బి.తవిటి రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు,దళితులు

గజపతినగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయన్ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బంగారమ్మపేట గ్రామంలో దళితులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలకు ఆజ్యం పోస్తోందని ఆరోపించారు.ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని, ఇతరుల హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించకూడదన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేసేలా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

సంక్రాంతి సంబరాలు



విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం: మరుపల్లిలోని బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్,ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. భోగి మంట చుట్టూ విద్యా ర్థులతో కలిసి మంత్రి నృత్యం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.బాలాజీ పాలి టెక్నికల్ విద్యాసంస్థల డైరెక్టర్ రెడ్డి నారాయణరావు, కరస్పాండెం ట్ రెడ్డి చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, కళాశాల అడ్వైజర్ డాక్టర్ రెడ్డి పావని,మాజీ జెడ్పీటీసీ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారాల జోరు

- సంక్రాంతి నేపథ్యంలో వెలసిన ఫుట్‌పాత్ దుకాణాలు
- మార్కెట్‌లో ప్రారంభమైన పండగ సందడి



మెయిన్‌రోడ్‌లో బళ్లపై చెరుకులు, పూజ సామగ్రి విక్రయాలు



విజయనగరం-పాలకొండ మెయిన్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌పై వస్త్రాల విక్రయం

చీపురుపల్లి: సరిగ్గా మరో ఆరు రోజుల్లో తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి రానుంది. దీంతో మార్కెట్‌లో వ్యాపారాల జోరు, ఫుట్‌పాత్ దుకాణాల సందడి ప్రారంభమయ్యింది. మార్కెట్‌లో ప్రధాన దుకాణాల సంగతి పక్కన పెడితే సంక్రాంతి సందర్భంగా మెయిన్‌రోడ్‌లో తాజాగా ఎక్కడికక్కడ ఫుట్‌పాత్ దుకాణాలు వెలుస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి మెయిన్‌రోడ్‌లో వెలుస్తున్న ఫుట్‌పాత్ దుకాణాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయి. ఫుట్‌పాత్ దుకాణాల్లో ప్రధానంగా పండగకు పెద్దలకు చూపించే అంచుల చీరలు, పంచెలు, తువ్వాళ్లు వంటి వస్త్రాల విక్రయాలు సాగుతున్నాయి. అయితే ప్రధాన వస్త్ర దుకాణాల్లో కూడా ఇలాంటి చీరలు, పంచెలు లభిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఫుట్‌పాత్ దుకాణాల్లోనే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుండడం విశేషం.

మూడు మండలాల వారికి ఇదే మార్కెట్

నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలోని మార్కెట్‌పైనే చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, లావేరు మండలాల్లోని పలు గ్రామాల వారు ఆధారపడతారు. పండగకు వస్త్రాలు, కిరాణా, ఇతర సామగ్రి కొనుగోలుకు ఆయా మండలాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి మెయిన్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఏటా సంక్రాంతికి వారం రోజుల ముందు వచ్చి భోగీ రోజు వరకు వ్యాపారాలు సాగించి, తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి



మాట్లాడుతున్న పీఓ ఉమాభారతి

గంట్యాడ: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి అన్నా రు. కిశోరి వికాసం కార్యక్రమంపై స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే వెంటనే పోలీసు లకు కాని, చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు కాని సమాచారం ఇవ్వాలన్నారు. రక్తహీనత సమస్య రాకుండా ఉండేం దుకు కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకునేలా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంఈఓ-2 వెంకటరావు, బెజ్జిపురం ఝాన్సీ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న వైద్యాధికారి సమీరా

బొండపల్లి: చైనాలో వెలుగు చూసిన హ్యూమన్ మెటా న్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) మన దేశంలోకి ప్రవేశించిందని, ప్రతి ఒక్కరూ అప్ర మత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సమీరా ప్రజలకు సూచించారు. ఆశ డే సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు,ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ హ్యూమన్ మెటా న్యూమో వైరస్ చిన్న పిల్లలు,వృద్ధుల్లో వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కోవిడ్ వలే ఈ వైరస్ కూడా ఒకరి నుంచి వేరొకరికి వ్యాప్తి చెందుతుందని, అయితే అంత ప్రమాదకరం కాదన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ.బాషా, పీహెచ్‌ఎన్ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించేందుకే...



దత్తిరాజేరు: పోరలిలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ రత్నకుమారి

దత్తిరాజేరు: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రీసర్వే డిప్యూ టీ తహసీల్దార్ రత్నకుమారి తెలిపారు. మండలంలోని పోరలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ భూసమస్యలపై రైతులు అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మండల సర్వేయర్ సుబ్బారావు, వీఆర్‌ఓ బలరాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేమలిలో..

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో ఆర్ఐ కె.అప్పలరాజు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం సభ ఏర్పాటు చేసి, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామపెద్ద మోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

గంట్యాడ: సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులపై చేపడుతున్న సర్వేను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా క్షయ, లెప్రసీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయించి, త్వరగా చికిత్స ప్రారంభించాలని సూచించారు.క్యాన్సర్ వ్యాధిపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవానంద సరస్వతి ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తులు



దేవానంద సరస్వతి స్వామి పాదుకలను ఊరేగిస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో సద్గురు దేవానంద సరస్వతి ఆరాధన మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గురుపాదుకా పూజా కార్యక్రమంలో భాగంగా దేవానంద సరస్వతి స్వామి పాదుకలను గ్రామంలో ఊరేగించా రు. అనంతరం ఆశ్రమంలో దేవానంద సరస్వతి శిష్యులు పి.సుబ్రమణ్యశర్మ, తదితరులు ప్రవచనాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



దత్తిరాజేరు: వింధ్యవాసి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాంలో సర్పంచ్ మంత్రి చిన్నమ్మలు మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలోని మురుగునీటి కాలువల్లో కార్మికులతో పూడిక, చెత్తచెదారం తీయించారు. సర్పంచ్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో పారి శుద్ధ్య పనులు చేయించామని చెప్పారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పనులను పంచాయతీ కార్యదర్శి, స్థానిక నాయకులు మంత్రి గోవింద, తదితరులు పర్యవేక్షించారు.

వింధ్యవాసిలో..

దత్తిరాజేరు: మండలంలోని వింధ్యవాసి గ్రామంలో సర్పంచ్ రంభ చంద్రశేఖర్ మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు.కార్మికుల తో అన్ని వీధుల్లోని మురుగ కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు.అలాగే గ్రామంలో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు.

ఇష్టారాజ్యంగా వీఓఏలను తొలగిస్తారా..?

- సర్వసభ్య సమావేశంలో ఏపీఎంని నిలదీసిన సభ్యులు



సభ్యులకు సమాధానమిస్తున్న వెలుగు ఏపీఎం

మెరకముడిదాం: వీఓఏలను ఇష్టారాజ్యంగా తొలగించే అధికారం మీకు ఎవరిచ్చారని వెలుగు ఏపీఎం ఏలూరి ధనలక్ష్మిని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మంగళవారం మం డల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ముందుగా శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండలంలో అయిదుగురు వీఓఏలు ఎలాంటి తప్పు చేయకపోయినా ఎందుకు తొలగించాల్సి వచ్చిందని సోమలింగాపురం ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజుతో పాటు మరికొందరు సభ్యులు నిలదీశారు.ఏనిబంధనల ప్రకారం వారిని తొలగించారని, గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసిన తర్వాతే తొలగించాల్సి ఉందని, నిబంధనలు పక్కనపెట్టి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఏపీఎం స్పందిస్తూ తాను కొత్తగా మండలానికి వచ్చానని, తాను వచ్చేసరికే ఆ అయిదుగురు వీఓఏలను తొలగించారని, ఏ కారణంతో తొలగించారో తనకు తెలియదని సమాధానమిచ్చారు. ఇప్పలవలస గ్రామంలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌ను ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి కోరారు. అలాగే సిరియా లపేట ప్రాథమిక పాఠశాలను ఆనుకుని చెరువు ఉందని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఎంఈఓ చంద్రశేఖర్‌ను కొర్లాం ఎంపీటీసీ జంపాన సావిత్రి కోరారు. మండలంలో ఎరువుల కొరత ఉందని, రైతులకు ఎరువులు లభించేలా చూడాలని నరసయ్యపేట సర్పంచ్ అప్పలనారాయణ, బుధరాయవలస సర్పంచ్ తమ్మినాయుడు, గరుగుబిల్లి ఎంపీటీసీ కొండలరావు ఏఓ శ్రావణితేజను కోరారు. ఏఓ స్పందిస్తూ ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎరువులు అందేలా చూస్తామన్నారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని డిప్యూటీ డీఈఓ కె.మోహన్‌రావు అన్నారు. గజపతినగరం బాలికోన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ.పైడితల్లి రూపొందించిన సాంఘిక శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను ఆ పాఠశాల విద్యార్థినులకు డిప్యూటీ డీఈఓ మంగళవారం పంపిణీ చేశారు. తనసొంత ఖర్చులతో స్టడీమెటీరియల్ తయారు చేసిన ఉపాధ్యా యుడు పైడితల్లిని ఆయన అభినందించారు. హెచ్‌ఎం చిప్పాడ రమేష్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. – గజపతినగరం

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తవలస మండల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పన్నదొరపాలెంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డైరెక్టర్ గండ్రెడ్డి సత్యనారాయణ సమక్షంలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా వద్దాది శంకరరావు, గౌరవ అధ్యక్షుడిగా టి.అప్పారావు, ఉపాధ్యక్షుడిగా రేగ ప్రసాద్, కార్యదర్శిగా మల్లువలస సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా సతీష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. సంఘం పాత కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. – కొత్తవలస

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు గరివిడి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు.ఎస్ఐ మాట్లా డుతూ ఆటోలో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించినా, మద్యం తాగి వాహనం నడిపినా చర్యలు తప్పవన్నారు. ఆటోకు రెండు వైపులా, వెనుకవైపున సేఫ్టీ రాడ్లు అమర్చుకోవాలని సూచించారు. స్కూల్ పిల్లలను తిప్పేవారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, పరి మితవేగంతో వాహనం నడపాలని చెప్పారు. అతివేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. – చీపురుపల్లిరూరల్(గరివిడి)

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

గుర్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వల్లాపురం ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సర్వశిక్ష అభియాన్ సామాజిక తనిఖీ బృందం సభ్యులు సూచించారు. పాఠశాలను సర్వశిక్ష అభియాన్ సామాజిక తనిఖీ బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, తరగతి గదులు,మధ్యాహ్న భోజన వంటలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. హెచ్‌ఎం అప్పారావుకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఎస్.లక్ష్మీనారాయణ, సంతోష్, రాజ్‌కుమార్, పూర్ణబాబు పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు అభినందన



ఈఈఎంటీ మెయిన్ పరీక్షకు ఎంపికైన ముచ్చర్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు



కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రతిభకనబరిచిన జిన్నాం హైస్కూల్ విద్యార్థిని శాంతిని అభినందిస్తున్న ఎంఈఓ-2 సాయిచక్రధర్

గజపతినగరం: మండలంలోని జిన్నాం ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని కె.శాంతి భారతీయ విజ్ఞాన మండలి(బీవీఎం), సైన్స్ సిటీ విజయవాడ వారు ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో ప్రథమ, రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీ య స్థానంలో నిలిచింది. జిన్నాం హైస్కూల్‌ను ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్ మంగళవారం సందర్శించిన సందర్భంగా విద్యార్థిని శాంతిని అభినందించారు.

ఈఈఎంటీ మెయిన్ పరీక్షకు ఎంపిక

ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ టెస్ట్(ఈఈఎంటీ) మెయిన్ పరీక్షకు మండలంలోని ముచ్చర్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఎపిఫనీ అనే సంస్థ ప్రభుత్వ పాఠశాల ల విద్యార్థులకు ఏటా మెరిట్ టెస్ట్ నిర్వహిస్తుందని, ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో మెయిన్స్‌కు అర్హత సాధించారని హెచ్‌ఎం సిద్దాంత త్రినాథరావు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.